సాక్షి నల్లగొండ

శనివారం ; 23 ; నవంబర్ ; 2024



అధిక సాంద్రత పద్ధతి మేలు

పత్తి సాగులో అధిక సాంద్రత పద్ధతి అవలంబించాలని గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్తలు కిరణ్, ఆదర్శ్ తెలిపారు. - 8లో



నేరుగా విత్తితే ప్రయోజనాలు

వరి విత్తనాలు నేరుగా విత్తితేనే అధిక ప్రయోజనాలని రాజేంద్రనగర్ వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త పద్మావతి అన్నారు. - 8లో



నల్లగొండలోని ఎన్జీ కళాశాల మైదానంలో ప్రజాపాలన-ప్రజా విజయోత్సవ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్

ప్రజాపాలన సంబరం



కళాకారులతో కలిసి డ్యాన్స్ చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, వేముల వీరేశం



కళాకారిణి నృత్య ప్రదర్శన

న్యూస్‌రీల్

మరో మూడు సమీకృత గురుకులాలు

నల్లగొండ : ఉమ్మడి జిల్లాకు మరో మూడు సమీకృత గురుకులాలు మంజూరయ్యాయి. నకిరేకల్, నాగార్జునసాగర్, కోదాడ నియోజక వర్గాల్లో ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేయబోతోంది. ఈమేరకు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బి.వెంకటేశం ఉత్తర్వులు జారీచేశారు. సమీకృత గురుకులాలు రెండో దశలో భాగంగా వీటిని మంజూరు చేసినట్లు ఆయన ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ) : నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో ఖాళీగా ఉన్న సబ్జెక్టులను బోధించుటకు గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉపేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎకనామిక్స్ 1, జువాలజీ 1 ఖాళీగా ఉన్నాయని.. పీజీలో 55 శాతం మార్కులు, నెట్, సెట్, పీహెచ్‌డీతో పాటు బోధన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 25వ తేదీలోపు కళాశాలలో దరఖాస్తులను సమర్పించాలని.. దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 26న ఇంటర్వ్యూలలు నిర్వహిస్తామని తెలిపారు.

మెరుగైన సేవలు అందించాలి



మొక్కలు నాటుతున్న ఈడీ

నల్లగొండ రూరల్ : ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తూ సంస్థ ఆర్థిక బలోపేతానికి కృషి చేయాలని ఆర్టీసీ ఈడీ వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం నల్లగొండ డిపోలో సిబ్బందితో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు. నల్లగొండ రీజియన్ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంచాలన్నారు. అంతకు ముందు డిపోలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్ఎం రాజశేఖర్, డిప్యూటీ ఆర్ఎం మాధవి తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

నల్లగొండ రూరల్ : కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్ఎం రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 7 డిపోల నుంచి అమరావతిలోని అమరలింగేశ్వర స్వామి, భీమవరంలో సోమేశ్వర స్వామి, పాలకొల్లులో క్షీరలింగేశ్వర స్వామి, సామర్లకోటలో భీమలింగేశ్వర స్వామి క్షేత్రాలకు బస్‌లు నడుపుతున్నట్లు వెల్లడించారు. ఈ నెల 24న ఆదివారం రాత్రి 8 గంటలకు అన్ని డిపోల నుంచి ప్రత్యేక బస్సులు బయలుదేరుతాయని.. ఒక్క రోజులోనే పంచారామ క్షేత్రాలను దర్శించుకునే అవకాశం ఆర్టీసి కల్పిస్తోందని తెలిపారు. వివరాలకు మిర్యాలగూడ : 08689 241111, నల్లగొండ : 7382834610, సూర్యాపేట హైటెక్ : 949492665, సూర్యాపేట న్యూ : 7382943819, కోదాడ : 7780433533, దేవరకొండ : 8639049226, యాదగిరిగుట్ట : 9885103165 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

24న ఉమ్మడి జిల్లాస్థాయి చెస్ పోటీలు

సూర్యాపేట టౌన్: అండర్-11, 15 ఓపెన్ విభాగాల్లో బాలబాలికలకు ఈ నెల 24న సూర్యాపేటలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ సూర్యాపేట జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గండూరి కృపాకర్, సతీష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులతో పాటు షీల్డ్, ప్రశంస పత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

ఓపీ బ్లాక్ నిర్మాణానికి రూ.3.60 కోట్లు

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లోని ఏరియా ఆసుపత్రిలో ఓపీ బ్లాక్ నిర్మాణానికి రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి రూ.3.60 కోట్ల నిధులు మంజూరు చేయించారు. ఈ మేరకు శుక్రవారం రూ 3.60 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులతో ఓపీ బ్లాక్‌తో పాటు పార్కింగ్ షెడ్, దోబీ ఘాట్, అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు చేయనున్నారు.

అభివృద్ధిని ఉరకలెత్తించాలి

- అధికారులు, ప్రజాప్రతినిధులు అన్నదమ్ముల్లా కలిసి పనిచేయాలి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తాం : మంత్రి కోమటిరెడ్డి
- ఎంపీ రఘువీర్‌రెడ్డి అధ్యక్షతన 'దిశ' సమావేశం



'దిశ' సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మలనాగేశ్వర్‌రావు, చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీలు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యేలు

నల్లగొండ : ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు అన్నదమ్ముల్లా కలిసి పనిచేసి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం నల్లగొండలోని ఉదయాదిత్య భవన్‌లో జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షక కమిటీ (దిశ) సమావేశం కమిటీ చైర్మన్, నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి మంత్రి తుమ్మల పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ కొత్త ప్రభుత్వంలో ప్రజలు కోరుకున్న మార్పు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. దేశంలోనే అత్యధికంగా వరి పండించేది తెలంగాణ అయితే.. రాష్ట్రంలో నల్లగొండ జిల్లాలో అధికంగా వరి పండిస్తున్నారని అందుకు రైతులకు ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. పత్తి కొనుగోళ్లలో దేశంలోనే రాష్ట్రం ముందు వరుసలో ఉందన్నారు. కేంద్రం నుంచి ఏఏ పథకాలకు నిధులు రావాల్సి ఉందో గుర్తించి వాటిని రప్పించే విధంగా ఎంపీలు కృషి చేయాలన్నారు. గత ప్రభుత్వం పౌర సరఫరాల శాఖలో తీసుకున్న నిర్ణయాల వల్ల ఆ శాఖ రూ.50 వేల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. మా ప్రభుత్వం అందులో రూ.10 వేల కోట్లు అప్పులు తీర్చిందని తెలిపారు.

అగ్రిమెంట్ క్యాన్సిల్ చేయాలి..

జిల్లాలో ఆయిల్‌పాం ప్యాక్టరీని ఎప్పుడు పెడుతున్నారని పతంజలి ఇన్‌చార్జిని మంత్రి ప్రశ్నించగా.. సంవత్సరంలో పెడతామని సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం పంటలు ఎక్కడ అమ్ముతున్నారని అడగ్గా అంధ్రప్రదేశ్‌లోని అంబాపురానికి పంపుతున్నామని చెప్పారు. 'ఇక్కడ పండించిన పంటను అంబాపురంలో అమ్మడం ఏంటి? వెంటనే పరిశ్రమ ఏర్పాటు చేయండి.. లేదంటే అగ్రిమెంట్ క్యాన్సిల్ చేస్తాం' అని మంత్రి తుమ్మల హెచ్చరించారు. ఇక్కడ ప్యాక్టరీ కడితే రైతులకు విశ్వాసం కలుగుతుందన్నారు. వెంటనే పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అభివృద్ధికి 'దిశ' కృషి : మంత్రి కోమటిరెడ్డి

మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ దిశ కమిటీ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించి సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి దిశ కమిటీలు కృషి చేస్తున్నాయన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వ పథకాలపై తమకు అభిప్రాయం తెలియజేస్తే.. కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు తీసుకొచ్చి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. దిశ కమిటీ చైర్మన్, ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా సుమారు 92 పథకాలు ఉన్నా.. కొన్నింటి ద్వారానే జిల్లాకు నిధులు అందుతున్నాయన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ కేంద్ర నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ పథకాలను పక్కాగా అమలు చేసి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. జిల్లాలో వ్యవసాయ పరిశోధన కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధిపై తయారు చేసిన ప్రాజెక్టును పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రులు, ప్రజాప్రతినిధులకు వివరించారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ దిశ కమిటీ సమావేశానికి వచ్చినప్పుడు కాకుండా ముందుగానే నివేదికలు పంపితే తాము మాట్లాడేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, జైవీర్‌రెడ్డి, వీరేశం, సామేల్, బాలునాయక్ మాట్లాడుతూ ధాన్యం అమ్ముకునే విషయంలో రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని కోరారు. అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. సమావేశంలో ఎస్పీ శరత్ చంద్ర పవార్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం వచ్చిన రోజే కొనాలి

నల్లగొండ రూరల్ : సరైన శాతం, నాణ్యతా ప్రమాణాలతో కొనుగోలు కేంద్రానికి ధాన్యం వచ్చిన రోజే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. శుక్రవారం ఆయన మంత్రి కోమటిరెడ్డితో కలిసి జిల్లా కేంద్రం సమీపంలోని కొత్తపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి మాట్లాడారు.



కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతున్న మంత్రులు

పెండింగ్ కేసులను పరిష్కరించాలి

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్



మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం : పెండింగ్ కేసులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోలీసు అధికారులతో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకుషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలన్నారు. ఫోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరగా ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని సూచించారు. ప్రతి అధికారికి పూర్తి ఇన్వెస్టిగేషన్, స్టేషన్ మేనేజ్మెంట్ తెలిసి ఉండాలన్నారు. ఫంక్షనల్ వర్టికల్స్ అమలు పరుస్తూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. ప్రమాదాల నివారణకు రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చూడాలని, అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, జూదం, ఇసుక, పీడీఎస్ అక్రమరవాణాను నియంత్రించాలన్నారు. జవాబుదారీగా ఉంటూ బాధితులకు సత్వర న్యాయం అందేలా పనిచేయాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ రాములునాయక్, ఎస్‌బీ డీఎస్పీ రమేష్, డీఎస్పీలు శివరాంరెడ్డి, రాజశేఖరరాజు, గిరిబాబు, సైదా, లక్ష్మీనారాయణ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం



చెక్కు అందజేస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం : పోలీసు కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన ఏఎస్ఐ రమణారెడ్డి, ఏఆర్ఎస్ఐ శ్రీనివాస్, హెడ్‌కానిస్టేబుల్ సుందర్‌రావు కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల చొప్పున చేయూత చెక్కులను శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అందజేశారు. వారి కుటుంబ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి



పెద్దవూరలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

పెద్దవూర : ప్రజల కోసం ప్రాణాలర్పించిన అమర వీరుల స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కార్యకర్తలు పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పెద్దవూర మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఎం మండల 8వ మహాసభలో ఆయన మాట్లాడారు. దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం జమిలీ ఎన్నికలు తీసుకురావడానికి ప్రయత్నించడం.. ఫెడరల్ స్ఫూర్తికి వ్యతిరేకమన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వందరోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి పూర్తిగా మోసం చేసిందన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కూన్‌రెడ్డి నాగిరెడ్డి, సీహెచ్ లక్ష్మీనారాయణ, నాయకులు కృష్ణారెడ్డి, దోరెపల్లి మల్లయ్య, దుబ్బ రామచంద్రయ్య, కొండేటి శ్రీను, కందుకూరి కోటేష్, ఎస్‌కే.బషీర్, పరమేష్, నాగార్జున, లచ్చునాయక్, కొండల్, ఆనంద్, రమేష్, లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'కూచిపూడి'

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ మాఢ వీధిలో శుక్రవారం సాయంత్రం నృత్యకారుల కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను అలరించాయి. సుమాంజలి నాట్య నిలయ బృందం, శ్రీమీనా నృత్యాలయ ఇనిస్టిట్యూట్ కళాకారులు పలు కీర్తనలను కూచిపూడి నృత్యరూపకంలో నర్తించి ఆకట్టుకున్నారు. -యాదగిరిగుట్ట



నేత్రపర్వంగా ఊంజల్ సేవోత్సవం

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఆండాళ్‌దేవికి ఊంజల్ సేవోత్సవం పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించారు. సాయంత్రం వేళ అమ్మవారిని పట్టువస్త్రాలు, వజ్రవైడూర్యాలతో అలంకరించి ప్రధానాలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలోని ప్రత్యేక వేదికపై అమ్మవారి సేవను తీర్చిదిద్ది ఊంజల్ సేవోత్సవం చేపట్టారు. అమ్మవారికి ఇష్టమైన నాధస్వరం వినిపించారు. అదే విధంగా ప్రధానాలయంలో నిత్యపూజలు కొనసాగాయి. వేకువ జామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు.. గర్భాలయంలోని స్వయంభూలు, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీపత్రాలతో అర్చన చేశారు.

డీఐఈఓను సస్పెండ్ చేయాలి

హాలియా : విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈఓ)ని తక్షణమే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం హాలియాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ మ్యాథ్స్ పోస్టును ఖాళీ చూపించకపోవడం వల్ల విద్యార్థులకు ఆ సబ్జెక్ట్ బోధించే అధ్యాపకుడు లేక.. వారి జీవితం నాశనమవుతోందన్నారు. ఈ పోస్టును భర్తీ చేయడంలో డీఐఈఓ పూర్తిగా విఫలమయ్యారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో రమేష్, వర్షిత్, నాగరాజు, కార్తీక్, సిద్దు, యశ్వంత్ పాల్గొన్నారు.



హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు 22,554

ముసాయిదా ఓటరు జాబితా ఖరారు.. నేడు ప్రకటన

- గతంలో కంటే పెరిగిన 1666 మంది ఓటర్లు
- ఈసారి పెరిగిన 19 పోలింగ్ కేంద్రాలు
- అత్యధిక ఓటర్లు హన్మకొండలో, అత్యల్పం సిద్దిపేటలో ..
- వచ్చేనెల 25న వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు తుది జాబితా విడుదలకు కసరత్తు

ఉమ్మడి నల్లగొండ జిల్లా వివరాలు ఇలా..

జిల్లా	పోలింగ్ స్టేషన్లు	పురుషులు	స్త్రీలు	మొత్తం
యాదాద్రి	17	549	277	826
సూర్యాపేట	23	1574	893	2467
నల్లగొండ	37	2479	1699	4178



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : వరంగల్ - ఖమ్మం - నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఓటర్ల లెక్క ఖరారైంది. ఓటు హక్కు కోసం 28,698 మంది దరఖాస్తు చేసుకోగా, అందులో స్క్రూటినీ తరువాత 22,554 మంది అర్హులైన ఓటర్లుగా అధికారులు తేల్చారు. గత ఎన్నికల్లో 20,888 మంది ఓటర్లుండగా ప్రస్తుతం చేపట్టిన ఓటరు నమోదు కార్యక్రమంలో గతంలో కంటే 1,666 మంది ఓటర్లు పెరిగారు. మొత్తంగా ఈసారి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజక వర్గంలో అర్హులైన ఓటర్ల సంఖ్య 22,554 మందిగా అధికారులు ఖరారు చేశారు. శనివారం ముసాయిదా జాబితాను జిల్లా ఎన్నికల అధికారి ప్రకటించనున్నారు.

6,144 మంది దరఖాస్తులు తిరస్కరణ

వరంగల్ - ఖమ్మం - నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదు ఈ నెల 6వ తేదీతో ముగిసిపోయింది. నియోజకవర్గం మొత్తంలో 28,698 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు కోసం తమ పేర్లను నమోదు చేసుకున్నారు. అందులో నిబంధనలకు అనుగుణంగా లేని 6,144 మంది టీచర్ల దరఖాస్తులను తిరస్కరించారు.

నేడు ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటన

ముసాయిదా ఓటరు జాబితా శనివారం ప్రకటించనున్నారు. మొత్తం 22,554 మంది ఓటర్లు ఉన్నారు. అయితే అత్యధికంగా హనుమకొండ జిల్లాలో 4,424 మంది ఓట్లు నమోదు చేసుకోగా, అతి తక్కువగా సిద్దిపేట జిల్లాలో 149 మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు. నల్లగొండ 4,178 మంది ఓటర్లతో రెండో స్థానంలో నిలిచింది.

నాలుగు జిల్లాల్లో తగ్గిన ఓటర్లు

గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉన్న ఓటర్ల సంఖ్యతో పోల్చితే ఈసారి నాలుగు జిల్లాల్లో ఓటర్ల సంఖ్య తగ్గింది. సిద్దిపేట, జనగామ, భద్రాద్రి, యాదాద్రి జిల్లాల్లో ఈసారి ఓటర్ల సంఖ్య తగ్గింది. వరంగల్ జిల్లాలో గతంలో కంటే ఈసారి అత్యధికంగా ఓటర్ల సంఖ్య నమోదైంది.

వచ్చే నెల 9వరకు అభ్యంతరాల స్వీకరణ, నమోదుకు అవకాశం

ఈ ముసాయిదా ఓటర్ల జాబితాపై ఈనెల 23వ తేదీ నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు. అలాగే కొత్త ఓటర్ల నమోదుకు కూడా అవకాశం కల్పిస్తారు. సవరణలను స్వీకరిస్తారు. వాటన్నింటిని వచ్చే నెల 25వ తేదీలోగా పరిష్కరించి తుది జాబితా ప్రకటిస్తారు.

పెరిగిన పోలింగ్ కేంద్రాలు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో గతంలో 181 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఈసారి వాటి సంఖ్య 200కు పెరిగింది. గతంలో కంటే 19 పోలింగ్ కేంద్రాలు పెరిగాయి. మొత్తం ఓటర్లలో పురుషులే అధికంగా ఉన్నారు. పురుష ఓటర్ల సంఖ్య 13,498 ఉండగా, మహిళ ఓటర్లు 9056 మంది ఉన్నారు.

క్లుప్తంగా

ఎంజీయూ హాస్టల్ వార్డెన్ నియామకం

నల్లగొండ రూరల్ : మహాత్మాగాంధీ యూనివర్సిటీలోని కృష్ణవేణి హాస్టల్ వార్డెన్‌గా తెలుగు విభాగం అధ్యాపకురాలు అనితాకుమారిని నియమిస్తూ రిజిస్ట్రార్ రవి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అదే విధంగా డిప్యూటీ డైరెక్టర్ కళ్యాణి పదవీకాలాన్ని పొడిగించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

వేములపల్లి: వేములపల్లి మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పుట్టల చిన నరసింహ బైక్‌పై వెళ్తున్నాడు. వేములపల్లి మండల కేంద్రంలో రోడ్డు దాటుతుండగా అదే సమయంలో హైదరాబాద్ నుంచి గుంటూరు జిల్లా నర్సారావుపేటకు వెళ్తున్న హైదరాబాద్‌లోని ఉప్పల్‌కు చెందిన హరిబాబు అతివేగంగా వచ్చి చిననరసింహ బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో నరసింహతోపాటు అతని బైక్ రోడ్డు అవతలి వైపునకు దూసుకెళ్లి అటుగా వెళ్తున్న మాతంగి సుధీర్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో చిన నరసింహ, సుధీర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో అక్కడకు చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై బాధితులెవరూ తమకు ఫిర్యాదు చేయలేదని ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని..


చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

మిర్యాలగూడ అర్బన్: ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మిర్యాలగూడ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పట్టణ కేంద్రానికి చెందిన ఉబ్బపల్లి నాగేందర్ మిర్యాలగూడ మున్సిపాలిటీలోని వాటర్ సప్లయ్ విభాగంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో తన కుటుంబ సభ్యులతో కలిసి భద్రాచలం వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నాడు. అతడి భార్యతోపాటు పిల్లలను బస్సులోకి ఎక్కించిన అనంతరం తన వెంట తెచ్చుకున్న బ్యాగుతో బస్సులోకి ఎక్కే సమయంలో బస్సు వెనక్కి కదలడంతో నాగేందర్ కిందపడ్డాడు. దీంతో అతడి కాలుపైనుంచి బస్సు టైర్ వెళ్లడంతో కాలు నుజ్జునుజ్జయింది. అతడిని ఏరియా ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం నల్లగొండకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అడ్వకేట్ స్టాండింగ్ కౌన్సిల్‌గా కాంసాని లక్ష్మయ్య


లక్ష్మయ్యకు నియామక పత్రం అందజేస్తున్న రజినీకాంత్‌రెడ్డి

పెద్దవూర: మండలంలోని తుంగతుర్తి గ్రామానికి చెందిన హైకోర్టు న్యాయవాది కాంసాని లక్ష్మయ్యను శంషాబాద్, తుర్కయంజాల్, మణికొండ, నర్సింగ్ మున్సిపాలిటీలకు హై కోర్టు అడ్వకేట్ స్టాండింగ్ కౌన్సిల్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ పదవిలో మూడు సంవత్సరాల పాటు కొనసాగనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు లీగల్ అఫైర్స్, లెజిస్లేటివ్ అఫైర్స్ అండ్ జస్టిస్ ప్రభుత్వ కార్యదర్శి తిరుపతి గురువారం నియామకపత్రం అందజేశారు. అడ్వకేట్ స్టాండింగ్ కౌన్సిల్‌గా నియామకమైన లక్ష్మయ్యను తెలంగాణ రాష్ట్ర అడిషనల్ అడ్వకేట్ జనరల్(ఏఏజీ) తేరా రజినీకాంత్ రెడ్డి అభినందించారు.

ఎంతో అభివృద్ధి చేశాం


మాట్లాడుతున్న రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

- ఎన్నికల్లో చెప్పని పనులు కూడా చేపట్టాం
- ప్రజల ఆరోగ్యం కోసమే మూసీ ప్రక్షాళన
- జిల్లాలోని ప్రాజెక్టులను పూర్తి చేస్తాం
- ప్రజాపాలన ప్రజా విజయోత్సవ సభలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : 'కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 11 నెలలు అయింది. అందులో మూడు మసాలు ఎన్నికల కోడే ఉంది. మిగిలిన ఎనిమిది నెలల్లోనే జిల్లాలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం' అని రాష్ట్ర రోడ్ల, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ ఎన్జీ కాలేజీ మైదానంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా ప్రజాపాలన ప్రజా విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై కళాకారులు ప్రదర్శనలు, నృత్యాల రూపంలో ప్రదర్శించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తాము ఎన్నికల్లో చెప్పిన హామీలతో పాటు చెప్పని వాటి కూడా చేసి తీరుతామన్నారు. మూసీ ప్రాజెక్టు గురించి ఎన్నికల్లో చెప్పలేదని.. నల్లగొండ జిల్లా ప్రజలు ఓ పక్క ఫ్లోరోసిస్, మరో పక్క మూసీ మురికి నీటితో ఇబ్బందులు పడుతున్నందున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజల ఆరోగ్యమే ముఖ్యమని భావించి మూసీ ప్రక్షాళన చేపట్టారని పేర్కొన్నారు. జిల్లాలోని ఎస్ఎల్‌బీసీతో పాటు బ్రాహ్మణవెల్లెంల, శివన్నగూడెం, ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి ప్రాజెక్టులను త్వరలో పూర్తి చేస్తామన్నారు. నల్లగొండ పట్టణంలో రూ.700 కోట్లతో, మిర్యాలగూడలో రూ.400 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ గురుకులాలు నిర్మిస్తున్నామని చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు ఓటమిని జీర్ణించుకోలేక ఐఏఎస్‌లపై దాడి చేసి చంపాలని చూడడం బాధాకరమన్నారు. అందరూ పోరాడితేనే తెలంగాణ వచ్చిందని.. వచ్చిన తెలంగాణలో ఎవరికీ లాభం చేకూరలేదు. కేసీఆర్ కుటుంబానికి చెందిన నలుగురే బాగుపడ్డారని విమర్శించారు. ఎంపీ రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉందని గత ప్రభుత్వం చేసిన అప్పుల కారణంగా ఇచ్చిన హామీలన్నీ అమలు చేయలేకపోతున్నామన్నారు. ప్రతిపక్షాలు విమర్శలు మాని అభివృద్ధికి కలిసి రావాలని సూచించారు. ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి కోసం మంత్రి కోమటిరెడ్డి ఎంతో శ్రమిస్తున్నారన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లాలో చేపట్టిన అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా కళాకారులు నృత్య ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ప్రొఫెసర్ అలేఖ్య, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్, ఆర్లె అశోక్‌రెడ్డి, డీఆర్‌ఓ అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.


ప్రొఫెసర్ అలేఖ్యను సన్మానిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


ప్రజాపాలన ప్రజా విజయోత్సవ సభకు హాజరైన ప్రజలు

అనాథ యువకుడు అనంతలోకాలకు

- రోడ్డుప్రమాదంలో మృతిచెందిన గుర్రంపోడు వాసి


షేక్ సద్దాం (ఫైల్)

గుర్రంపోడు: తల్లిదండ్రులు లేక స్నేహితుల వద్ద ఉంటూ జీవనం సాగిస్తున్న యువకుడు గురువారం రాత్రి కనగల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. గుర్రంపోడు మండల కేంద్రానికి చెందిన షేక్ సద్దాం (24) తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోయారు. పెంచిన నానమ్మ కూడా మృతిచెందింది. సద్దాంకు ఇటీవలే పెళ్లి నిశ్చయం కాగా త్వరలో వివాహం కావాల్సి ఉంది. స్థానిక వైన్స్‌లో పనిచేస్తూ స్నేహితుల వద్ద ఉంటున్నాడు. సద్దాం తన మిత్రుడి మరదలు పెళ్లికి కొంతమంది స్నేహితులతో కలిసి గురువారం దర్వేశిపురం వెళ్లాడు. రాత్రి బైక్ పై తిరిగి వస్తుండగా కనగల్ సమీపంలో ట్రాక్టర్ ఢీ కొట్టడంతో మృతిచెందాడు. బైక్‌పై ఉన్న బైరు మధుకు తీవ్ర గాయాలు కాగా హైదరాబాద్‌లో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై కనగల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం


వీరభద్రయ్య (ఫైల్)

అర్వపల్లి: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన జాజిరెడ్డిగూడెం మండలం సీతారాంపురం సమీపంలో నకిరేకల్– తానంచర్ల జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుంగతుర్తి మండలం వెలుగుపల్లి గ్రామానికి చెందిన గైగుళ్ల వీరభద్రయ్య(55) భార్య భద్రమ్మ జ్వరంతో బాధపడుతోంది. గురువారం ముందుగా ఆమెను సూర్యాపేట ఆస్పత్రికి పంపించాడు. ఆర్వాత రాత్రి తన మోపెడ్‌పై సూర్యాపేటకు వెళ్తుండగా సీతారాంపురం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తలకు బలమైన గా యమై అక్కడికక్కడే మృతిచెందాడు. శుక్రవారం మృతదేహానికి తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడికి భా ర్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడు గైగుళ్ల సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

హిందుస్థాన్ గోడౌన్‌లో అగ్నిప్రమాదం


దగ్ధమవుతున్న గోడౌన్

బీబీనగర్: బీబీనగర్ మండలం చిన్నరావులపల్లి గ్రామ పరిధిలో గల హిందుస్థాన్ శానిటరీ వేర్ పరిశ్రమకు చెందిన గోడౌన్‌లో శుక్రవారం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గోడౌన్ పక్కనే ఉన్న పంట పొలాల్లో వరి కొయ్యలను నిప్పు పెట్టడంతో నిప్పు రవ్వలు గాలికి గోడౌన్‌లోకి ఎగిసి పడ్డాయి. దీంతో గోడౌన్‌లో గల వాష్‌బేషన్స్, వెస్టన్, సాధారణ బాత్‌రూం కుండీలు, ఇతర శానిటరీ వేర్ తయారీ వస్తువులు, ప్యాకింగ్ చేసి ఉంచిన కాటన్ బాక్స్‌లు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. రూ.లక్షల్లో ఆస్తి నష్టం వాటిల్లినట్లు పరిశ్రమ జీఎం తివారీ తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి


మృతుడు అంజయ్య

చింతపల్లి: మండల పరిధిలోని గోడకొండ వద్ద హైదరాబాద్ – నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై శుక్రవారం జరి గిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మర్రిగూడ మండలం తిరుగండ్లపల్లి గ్రామానికి చెందిన ఉడుతల అంజయ్య(68) హైదరాబాద్ నుంచి చింతపల్లి వైపు మోటార్ సైకిల్‌పై వస్తున్నాడు. ఈక్రమంలో హైదరాబాద్ నుంచి వస్తున్న కారు అంజయ్య బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కృష్ణానదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

హాలియా: తిరుమలగిరి మండలంలోని జమ్మలకోట గ్రామ పరిధిలో గల కృష్ణానదిలో శుక్రవారం సుమారు 50 ఏళ్ల వయసు ఉన్న గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం తేలాయాడుతోంది. స్థానికుల సమాచారం మేరకు తిరుమలగిరి ఎస్ఐ వీర శేఖర్ అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. చనిపోయిన వ్యక్తి నీలం రంగు చొక్క, తెలుపు రంగు పంచె కట్టుకుని ఉన్నాడని, మృతుడి కాళ్లకు నీలం రంగు తాడుతో కట్టి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 87126 70199 నంబర్‌ను సంప్రదించాలని పోలీసులు పేర్కొన్నారు.

విద్యుత్ మోటార్లలో కాపర్ వైరు చోరీ

తిరుమలగిరి: మండలంలోని అనంతారం బిక్కేరువాగులో రైతులకు చెందిన విద్యుత్ మోటార్లలో కాపర్ వైరును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. శుక్రవారం గ్రామానికి చెందిన రైతులు మొలుగూరి రామకృష్ణ, వజ్జ కొమురయ్య, గొడిశాల రాజుకు సంబంధించిన విద్యుత్ మోటార్లలో కాపర్ వైర్ అపహరణకు గురికావడంతో స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వరి నార్లు పోసుకునే సమయంలో విద్యుత్ మోటార్లు చోరీకి గురవుతున్నాయని రైతులు పేర్కొన్నారు.

తాను చదువు చెప్పే స్కూల్‌లోనే కుమారుడికి అడ్మిషన్


కుర్రారం ఉన్నత పాఠశాలలో తన కుమారుడిని చేర్పిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు శివరాజ్

రాజాపేట : డీఎస్సీ -2024 ద్వారా రాజాపేట మండలంలోని కుర్రారం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా నియామకమైన గుజ్జ శివరాజ్ తన కుమారుడు నాగజితేంద్రను కూడా శుక్రవారం అదే పాఠశాలలో చేర్పించి ఆదర్శంగా నిలిచారు. నాగజితేంద్ర ప్రస్తుతం 6వ తరగతి చదువుతున్నాడు. కాగా తన కుమారుడు చదువుతున్న తరగతికి శివరాజ్ గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టులు బోధిస్తున్నాడు. శివరాజ్‌ను ఎంఈఓ రమేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

నేరుగా విత్తే పద్ధతితో అధిక ప్రయోజనాలు


నీలాయిగూడెంలో వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

త్రిపురారం: నేరుగా విత్తే పద్ధతిలో వరి సాగుతో రైతులకు అధిక ప్రయోజనాలు చేకూరుతాయని భారతీయ వరి పరిశోధన స్థానం రాజేంద్రనగర్ ప్రధాన శాస్త్రవేత్త పద్మావతి అన్నారు. శుక్రవారం త్రిపురారం మండలంలోని కంపాసాగర్ పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)ను రాజేంద్రనగర్ వరి పరిశోధన శాస్త్రవేత్తలు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు సంయుక్తంగా సందర్శించారు. ఈ సందర్భంగా నీలాయిగూడెం, సత్యనారాయణపురం గ్రామంలో నేరుగా విత్తే పద్ధతిలో వరి పంటను సాగు చేసిన రైతుల పొలాలను పరిశీలించి వారి అభిప్రాయాలు సేకరించారు. ప్రధాన శాస్త్రవేత్త పద్మావతి మాట్లాడుతూ.. నేరుగా విత్తే పద్ధతితో తక్కువ నీటి వనరులు ఉన్నా వరి పంటను సాగు చేసుకోవచ్చని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో యాంత్రీకరణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస రావు, ఎస్‌బీఐ ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్, ఆర్పిత, సేద్యపు విభాగం శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్, శ్రీనివాస్, అజయ్, శ్రీకాంత్, రైతులు కంచి సోమయ్య, ప్రసాద్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగలో కొత్త వంగడాలు వాడాలి


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న డాక్టర్ బేరా

మోతె: వేరుశనగ పంటలో అధిక దిగుబడులు పొందడానికి కొత్త వంగడాలు వాడాలని డాక్టర్ బేరా అన్నారు. శుక్రవారం మోతె మండలంలోని రావిపహాడ్, సిరికొండ గ్రామాల్లో కృషి విజ్ఞాన కేంద్రం గడ్డిపల్లి, భారతీయ వేరుశనగ పరిశోధన సంచాలయ గుజరాత్ వారి సహకారంతో నిర్వహించిన క్షేత్ర స్థాయి పర్యటనలో ఆయన మాట్లాడారు. వేరుశనగ పంటలో అధిక దిగుబడికి యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. అనంతరం రావిపహాడ్‌లోని రైతు వేదికలో రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

పత్తి సాగులో అధిక సాంద్రత పద్ధతి మేలు


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

పెన్‌పహాడ్: పత్తి సాగులో అధిక సాంద్రత పద్ధతి అవలంబించడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని కేవీకే శాస్త్రవేత్తలు కిరణ్, ఆదర్శ్ తెలిపారు. పెన్‌పహాడ్ మండల కేంద్రంలో శుక్రవారం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పత్తి సాగుపై క్షేత్ర దినోత్సవం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ.. అధిక సాంద్రత పద్ధతి పత్తి సాగు అవలంబించడం ద్వారా జాతీయ పత్తి పరిశోధన సంస్థ నాగపూర్ ఎంపిక చేసిన రైతుల ఖాతాల్లోకి నేరుగా విత్తనాల ఖర్చు, మెపిక్వాటుక్లోరైడ్ మందు ఖర్చు, సమగ్ర సస్యరక్షణ చర్యలకు అయ్యే ఖర్చు జమ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం లింగాకర్షక బుట్టలు, జిగురు అట్టలు, దీపపు ఎర వాడే విధానాలను వివరించారు. పత్తితీత అనంతరం పత్తి కట్టెలను కాల్చకుండా కాటన్ శెడ్డర్‌ను చేసుకొని అదే నెలలో కలియ దున్నితే నేల సారం పెరగడమే కాకుండా గులాబీ రంగు పురుగు ఉధృతిని నివారించుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో యంగ్ ప్రొఫెషనల్స్ సంతోష్ పాల్గొన్నారు.

డ్రోన్ టెక్నాలజీ.. అదరహో


చందంపేటలో కంది చేనుకు డ్రోన్ ద్వారా క్రిమి సంహారక మందు పిచికారీ చేయిస్తున్న దృశ్యం

చందంపేట: చందంపేట రైతులు సాంకేతిక టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్నారు. మండల కేంద్రానికి చెందిన రైతు గోసుల శివ తన ఎకరం కంది చేనుకు డ్రోన్ ద్వారా క్రిమిసంహారక మందు పిచికారీ చేయించాడు. డ్రోన్‌కు ఉండే డ్రమ్ముకు రూ.500 చొప్పున వెచ్చించినట్లు రైతు పేర్కొన్నాడు. డ్రోన్‌తో సాయంతో పంటకు క్రిమిసంహారక మందు పిచికారీ త్వరితగతిన పూర్తవుతుందని, కూలీల కొరతను అధిగమించవచ్చని రైతు తెలిపాడు.

మునగాల విద్యార్థికి గోల్డ్‌మెడల్


గోల్డ్‌మెడల్‌తో శేషిమేఘన్

మునగాల: మండల కేంద్రానికి చెందిన గట్టు శేషిమేఘన్ సెప్టెంబర్‌లో చిలుకూరులోని అక్షర స్కూల్‌లో నిర్వహించిన ఆర్ట్ కలరింగ్ పోటీలో గోల్డ్‌మెడల్ సాధించాడు. శేషిమేఘన్ హుజూర్‌నగర్‌లోని రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. విద్యార్థిని గైడ్ చేసిన ఆర్ట్ ఉపాధ్యాయుడు నాగజాను సూరేపల్లి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం అభినందించింది. శేషిమేఘన్ 2025 జనవరిలో ముంబాయిలో జరిగే అంతర్జాతీయ ఆర్ట్ కలరింగ్ కాంపిటీషన్‌లో పాల్గొననున్నాడు.

ప్రతీకార హత్యకు కుట్ర.. భగ్నం

- నలుగురు నిందితుల అరెస్టు
- నాలుగు పిస్టళ్లు, 18 రౌండ్ల మ్యాగ్‌జిన్స్, సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: ప్రతీకార హత్యకు పన్నిన కుట్రను భగ్నం చేసిన పోలీసులు.. నిషేధిత జనశక్తి దళం ఏర్పాటు ప్రక్రియను మొదట్లోనే తుంచేశారు. నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి మారణాయుధాలు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం జిల్లా కేంద్రం ఆదిలాబాద్‌లోని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్పీ గౌస్ ఆలం వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా సున్నిపెంట గ్రామానికి చెందిన మైల దిలీప్, నంద్యాలకు చెందిన అవులపాటి హిమకాంత్‌రెడ్డి ఉత్తరప్రదేశ్‌లోని కాశీ నుంచి నాలుగు పిస్టళ్లు, ఎనిమిది మ్యాగజిన్స్, 18 లైవ్‌రౌండ్స్ కొనుగోలు చేసి నంద్యాలకు తరలిస్తున్నారు. ఆదిలాబాద్ రూరల్ పోలీసుస్టేషన్ పరిధి చాంద–టి సమీపంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తూ గురువారం పట్టుకున్నారు. మరణాయుధాలు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు. వీరిని విచారించగా కుట్రకోణం బయపడింది. ప్రధాన నిందితుడు నంద్యాలలోని సున్నిపెంటకు చెందిన వొట్టి వెంకట్‌రెడ్డి గతంలో జనశక్తి పార్టీలో పనిచేశాడు. ఇతడిపై రెండు టాడా కేసులు, వివిధ సంఘ విద్రోహ కేసులతోపాటు మూడు హత్య కేసులు, ఒక హత్యాయత్నం కేసు, నాలుగు జనశక్తికి సంబంధించిన కేసులు ఉన్నాయి. సూర్యాపేటకు చెందిన తన మిత్రుడు హత్యకు గురికావడంతో ప్రతీకార చర్యగా, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లాలో మళ్లీ జనశక్తి దళం ఏర్పాటుకు నిర్ణయించుకున్నాడు. మరణాయుధాల కొనుగోలుకు నల్లగొండ జిల్లా నకిరేకల్‌కు చెందిన నలగంటి ప్రసన్నరాజు ఆర్థిక సాయం అందించాడు. వెంకట్‌రెడ్డి తన అనుచరుడైన హిమకాంత్‌రెడ్డి, మైల దిలీప్, అతడి రెస్టారెంట్‌లో పనిచేసే బిహార్‌కు చెందిన కుక్ భైరవ్‌లు కలిసి కాశీకి వెళ్లారు. అక్కడి నుంచి బిహార్‌లోని మ్యుంగేర్ రైల్వేస్టేషన్‌లో పిస్తోల్, బుల్లెట్లు తీసుకున్నారు. భైరవ్ కాశీలోనే ఉండిపోయాడు. వీరు నంద్యాలకు వెళ్లే క్రమంలో ఆదిలాబాద్ పోలీసులకు పట్టుబడ్డారు. ఇద్దరిని విచారించడంతో వెంకట్‌రెడ్డి, ప్రసన్నరాజుల కుట్రను వెల్లడించారు. గురువారం రాత్రి వారిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. కుట్రకు సంబంధించి మొత్తం తొమ్మిది మంది నిందితులు ఉన్నట్లుగా గుర్తించారు. వీరిలో నలుగురిని అరెస్ట్ చేయగా మిగతా ఐదుగురు పరారీలో ఉన్నట్లుగా ఎస్పీ తెలిపారు. నాలుగు పిస్తోళ్లు, ఎనిమిది మ్యాగజైన్స్, 18 లైవ్ రౌండ్స్, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ సురేందర్‌రావు, డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు ఫణీందర్, కరుణాకర్‌రావు, సాయినాథ్, ఎస్సై ముజాయిద్ పాల్గొన్నారు.

చర్చనీయాంశంగా నలగాటి అరెస్టు

నకిరేకల్ : నకిరేకల్ పట్టణానికి చెందిన కంటి వైద్య నిపుణుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నలగాటి ప్రసన్నరాజును ఆదిలాబాద్ జిల్లా పోలీసులు అరెస్టు చేయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. పిస్టల్ కొనుగోలుకు ఆర్థిక సాయం చేశారన్న అనుమానంతో ఆదిలాబాద్ రూరల్ పోలీసులు ప్రసన్నరాజుతో పాటు మరో ముగ్గురుపై కేసు నమోదుచేసి అదుపులోకి తీసుకున్నారు. నలగాటి ప్రసన్నరాజ్ సొంత గ్రామం ఖమ్మం జిల్లా కుసుమంచి. ప్రసన్నరాజ్ తన విద్యాభ్యాసం సమయంలోనే ఖమ్మం జిల్లాలో పీడీఎస్‌యూలో క్రియాశీలకంగా పనిచేశారు. జనశక్తి పార్టీకి సానుభూతిపరుడిగా ముద్ర ఉంది. 35 ఏళ్ల క్రితమే నకిరేకల్‌కు వచ్చి స్థిరపడ్డారు. నకిరేకల్‌లో కంటి వైద్యుడిగా సేవలందించారు. 2005లో కాంగ్రెస్‌లో చేరి నకిరేకల్–2 ఎంపీటీసీగా గెలిచారు. ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర కోశాదికారిగా పని చేశారు. 2009లో నకిరేకల్ నియోజకవర్గం ఎస్సీ రిజర్వ్‌డ్ కావడంతో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశించారు. 2014, 2018, 2023లోనూ కాంగ్రెస్ నుంచి నకిరేకల్ ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నం చేశారు. తర్వాత కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. ప్రస్తుతం బీఆర్ఎస్‌లో క్రియశీల నేతగా ఉన్నారు. ప్రసన్నరాజ్ భార్య యాదాద్రి జిల్లాలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. శుక్రవారం ఆదిలాబాద్‌లో జిల్లా కేంద్రంలోని రూరల్ పోలీస్ స్టేషన్లో ప్రసన్నరాజ్‌పై కేసు నమోదుచేసి అరెస్టుతో సర్వత్రా చర్చంశంగా మారింది.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక


విద్యార్థిని ప్రణవిని సన్మానిస్తున్న ఎంఈఓ రఘురాంరెడ్డి, ఉపాధ్యాయులు

మోటకొండూర్: 68వ జాతీయ స్థాయి అండర్–14 హ్యాండ్ బాల్ పోటీలకు మోటకొండూర్ మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి ఉండాడి ప్రణవి ఎంపికైంది. ఈ సందర్భంగా మండల ఎంఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘురాంరెడ్డి శుక్రవారం ప్రణవిని ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో నవంబర్ 8,9,10 వ తేదీలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిందని చెప్పారు. ఛత్తీస్‌ఘడ్‌లో జరిగే 68వ జాతీయ పోటీల్లో పాల్గొననుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఈటీ నాతి మల్లేశం, రాజగోపాల్, ప్రభాకర్‌రెడ్డి, భాగ్యశ్రీ, భవాని, రాజశేఖర్, సుధారాణి, శ్రీలత, రమేష్, విశ్వరూపం తదితరులు పాల్గొన్నారు.